# ఫ్యూచర్ సిటీలో భారీ ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) సదస్సులో మూడోరోజు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం' పలు కీలక సమావేశాల్లో పాల్గొంది. ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ బృందంతో పలు సంస్థలు పరస్పర అవగాహన ఒప్పందాలు(ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో 'యూపీసీ వోల్ట్' సంస్థ డేటా సెంటర్‌ను స్థాపించడానికి ముందుకొచ్చింది. దీనిద్వారా 3,800 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. 'స్నైడర్' సంస్థ రూ.623 కోట్లతో తమ యూనిట్ల విస్తరణ ప్రణాళికను ప్రభుత్వం ముందుంచింది.



**నెదర్లాండ్స్ సంస్థతో కీలక ఎంఓయూ**

దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ఈ మేరకు దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రెన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రెన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం... ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో.. ఏఐ డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుపై ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ డేటాసెంటర్ నిర్మాణ దశలోనే 3వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమయ్యాక మరో 800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలకపాత్ర పోషిస్తాయి. పర్యావరణ పరిరక్షణతోపాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రూ.150 కోట్లతో గోద్రెజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణ**

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో గురువారం గోద్రెజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పెంపకంలో ఏఐ వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రెజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్లతో విస్తరించే అవకాశాలపై చర్చించారు. ఫ్యూచర్ సిటీలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపైనా మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు సూచించారు. నాదిర్ గోద్రెజ్‌ను హైదరాబాద్‌కు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

**సౌర, పవన విద్యుదుత్పత్తిపై 'ఐనాక్స్' ఆసక్తి**

తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో తెలంగాణ రైజింగ్ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై చర్చించారు. తెలంగాణలో తొలుత సౌర, పవన విద్యుదుత్పత్తి చేపట్టి, అనంతరం తయారీ రంగంలోకి విస్తరించేందుకు ఐనాక్స్ గ్రూప్ ప్రణాళికలు రూపొందిస్తోంది. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "రాష్ట్ర పారిశ్రామిక రంగానికి క్లీన్ ఎలక్ట్రిసిటీని, గ్రీన్ హైడ్రోజన్‌ను అందించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నాం. డేటా సెంటర్లకు అధికస్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోంది. తెలంగాణ నూతన ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాం. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా క్యూర్, ప్యూర్, రేర్ ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం" అని వివరించారు.

**శంషాబాద్‌లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ**

స్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ శంషాబాద్, గాగిల్లాపూర్‌లలోని తమ యూనిట్లను రూ.623 కోట్లతో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్నైడర్ కంపెనీ సీఈవో దీపక్‌శర్మ సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునికీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ భద్రతకు సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరగనుంది. స్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలో 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలున్నాయి. ఈ సంస్థ విస్తరణ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును ముఖ్యమంత్రి అభినందించారు. అనంతరం ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చించారు.

# ఏ తప్పూ చేయలేదు.. దేనికీ భయపడం

-మొదటిపేజీ తరువాయి

హామీలు నిలబెట్టుకునే తెలివి లేదన్నారు. హామీలు అమలు చేయకుండా అటెన్షన్ డైవర్షన్ గేమ్స్ ఆడుతున్నారని చెప్పారు. ఈ రెండేళ్ల డ్రామాలు తప్ప రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాధించిందేమీ లేదని చెప్పారు. జిల్లాలను తగ్గించాలని చూస్తే బీఆర్ఎస్ ప్రజల పక్షాన ఉద్యమిస్తుందని హెచ్చరించారు. మొన్న హరీశ్‌రావు బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టారని సాయంత్రానికల్లా సిట్ నోటీస్ ఇచ్చారని కేటీఆర్ చెప్పారు. ఇటు రేవంత్‌రెడ్డి.. అటు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పెద్దలు బదులుకొని ఎలా దోపిడీ చేస్తున్నారో బయటపెడితేనే నోటీసులు పంపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడితే ఆశ్చర్యం అనిపించిందని చెప్పారు. తాము ఆధారాలతో సహా చూపెడుతుంటే.. దొంగనే ఫిర్యాదు చేయాలనడం ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో కేంద్ర ప్రభుత్వ వైఖరి అట్లనే ఉందన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని చెబితేనే జర్నలిస్టులు వార్తలు రాశారని.. వాటిపై ప్రభుత్వం ఖండించలేదని చెప్పారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీని అడుగుతున్నాను.. ప్రస్తుతం మా ఫోన్లు ట్యాప్ చేయడం లేదని ప్రమాణం చేసి చెప్పగలుగుతారా అని అన్నారు.

ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రలు ఎవరైనా చేస్తే కాపాడేందుకు నెహ్రూ టైం నుంచి ఇప్పటి మోదీ వరకు ఇది ఉంటుందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అధీనంలో ఉండే పోలీసులు కూడా ఇవాళ దేశంలో కొన్ని వేల ఫోన్లు వింటున్నారని.. అది ఆయనకు తెలుసో తెలియదో తనకు తెలవదని కేటీఆర్ అన్నారు.

**శాంతిభద్రతల వ్యవహారం**

దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రభుత్వాల స్థిరత్వానికి సంబంధించి పోలీసులు రొటీన్‌గా చేసే కార్యక్రమమని కేటీఆర్ పేర్కొన్నారు. దానికి మంత్రులు, ప్రభుత్వంలో ఉండే నాయకులకు పాత్ర ఉండదని.. ఇదే చెబుతానని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు గూఢచారి వ్యవస్థ మీద ఆధారపడతాయని,



ప్రభుత్వాధినేతలకు రిపోర్టులు వస్తాయన్నారు. అవి ఎట్లా వస్తాయో తమకు తెలవదని పేర్కొన్నారు.

**సిట్ ఎవరిని పిలవాలి?**

నిజానికి గతంలో ఇంటెలిజెన్స్ ఐజీగా పనిచేసిన ప్రస్తుత డీజీపీగా ఉన్న శివధర్‌రెడ్డిని పిలిచారా? బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి ఇంటెలిజెన్స్ ఐజీ ఎవరు? ఇవాల్టి డీజీపీ శివధర్‌రెడ్డి, మొన్నటి దాకా డీజీపీగా పనిచేసిన జితేందర్‌కు తెలుస్తది ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో, మాకేం తెలుస్తదని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ఇవాళ రేవంత్ రెడ్డి ట్యాప్ చేయడం లేదని ఒక్క అధికారి కెమెరా ముందుకు వచ్చి చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

**పది రోజుల టైం పాస్ వ్యవహారం**

ముఖ్యమంత్రి దావోస్ పోయిండు కదా? ఆడికెళ్లి హార్వర్డ్ పోతుండు కదా? 10 రోజులు టైం పాస్ చేయాలి కదా? అందుకే ఒక రోజు హరీశ్‌రావును, ఒక రోజు కేటీఆర్‌ను పిలవండి.. అని సిట్‌కు ఆదేశాలిచ్చారని కేటీఆర్ అన్నారు. హరీశ్‌రావును పిలిచి అడిగిందే అడుగుడు, తిర్లమర్ల చేసి అడుగుడు, మరల తిర్లేసి అడుగుడు తప్ప.. ఈ ప్రభుత్వం ప్రజలకు పనికొచ్చే పనిచేసిందా అన్నారు.

దావోస్ పోయిన ముఖ్యమంత్రి ఎక్కడా ఉపముఖ్యమంత్రి తన కుర్చీ గుంజుకుంటాడోనని రేవంత్‌రెడ్డి నోటీసులు పేరిట టైంపాస్ డ్రామా చేయిస్తుండని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, 'సెస్'చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

కాజీపేట

ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ జాతర భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలనుంచి వచ్చి వెళ్లే వారి కోసం కాజీపేట, వరంగల్ మీదుగా, కాజీపేట, వరంగల్ నుంచి జన్ సాధా రణ్ అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు గురువారం దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. ' ఈ నెల 28, 30, ఫిబ్రవరి 1వ తేదీల్లో సికింద్రాబాద్‌మంచిర్యాల (07495) వెళ్లే ఎక్స్‌ప్రెస్, జనవరి 28, 30, ఫిబ్రవరి 1 తేదీల్లో మంచిర్యాలసికింద్రాబాద్ (07496) వెళ్లే ఎక్స్‌ప్రెస్, జనవరి 29, 31వ తేదీల్లో సికింద్రాబాద్‌సిర్పూర్ కాగజ్‌నగర్ (07496) వెళ్లే ఎక్స్‌ప్రెస్, జనవరి 29, 31 తేదీల్లో సిర్పూర్ కాగజ్‌నగర్‌సికింద్రాబాద్ (07497) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు చేరుకొని వెళ్తాయి. ఈ రైళ్లకు మౌ లాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి, ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేట, వరంగల్, హసన్‌పర్తి, ఉప్పల్, జమ్మికుంట, బిజిగిరిషరీఫ్, పొత్కపల్లి, ఓదెల, కొలనూర్, పెద్దపల్లి, రాఘవపురం, రామగుండం, పెద్దంపేట్‌లో హాల్టింగ్ కల్పించారు. ' ఈ నెల 28 నుంచి 31 తేదీల్లో నిజామాబాద్‌వరంగల్ (07499) వెళ్లే ఎక్స్‌ప్రెస్, 28 నుంచి 31 తేదీల్లో వరంగల్‌నిజమాబాద్ (07500) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లకు కామారెడ్డి, అక్కన్నపేట, మిర్జాపల్లి, వాడిరామ్, మనోహరాబాబాద్, మేడ్చల్, బొల్లారం, మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, వంగపల్లి, ఆలేరు, జనగామ, రఘునాథ్ పల్లి, ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేటలో హాల్టింగ్ కల్పించారు. ' ఈ నెల 28 నుంచి 31 తేదీలలో కాజీపేటఖమ్మం (07504) వెళ్లే ఎక్స్‌ప్రెస్, జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఖమ్మంకాజీపేట (07503) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లకు వరంగల్, చింతల్‌పల్లి, నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్, పాపట్‌పల్లి, మల్లెమడుగులో హాల్టింగ్ కల్పించారు.

## దావోస్ పెట్టుబడులు రూ.28,693కోట్లు

-మొదటిపేజీ తరువాయి

జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన విషయాన్ని గుర్తు చేశాయి.

**పెట్టుబడులు.. కీలక ఒప్పందాలు**

మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సుస్థిర అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి డబ్ల్యూఈఎఫ్ నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలంటూ సీఎం చేసిన ప్రతిపాదనపై డబ్ల్యూఈఎఫ్ వర్గాలు సానుకూలంగా స్పందించాయి.

**స్వదేశానికి మంత్రులు**

ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో జరిగిన 12 ముఖాముఖి సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం.. తెలంగాణ ప్రతినిధి బృందం మూడు రోజుల దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. దావోస్‌లో కార్యక్రమాలు ముగించుకున్న ముఖ్యమంత్రి.. రోడ్డు మార్గంలో జ్యూరిచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి అమెరికాకు బయలుదేరి వెళ్తారు. తెలంగాణ బృందంలో సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాతీయ రికార్డు

-మొదటిపేజీ తరువాయి

గురువారం సమీక్షించారు. తొలుత కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పౌరసరఫరాలశాఖ, నీటిపారుదల శాఖల సమన్వయంతోపాటు తెలంగాణ రైతాంగానికి ఈ రికార్డులో భాగస్వామ్యం ఉందన్నారు. డీలర్లు ఎవరైనా రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే వెంటనే వారి డీలర్‌షిప్‌ను రద్దుచేయాలని అధికారుల్ని ఆదేశించారు. "గత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యం భారీగా దుర్వినియోగమైంది. బీరు ఫ్యాక్టరీలకు, రీసైక్లింగ్‌కు వెళ్లేది. ఆనాటి అక్రమాల్ని అరికట్టడానికి మేం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టాం.

రాష్ట్రంలో 85% (3.71 కోట్ల) మందికి.. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ఘనత తెలంగాణదే. సన్నబియ్యంతోపాటు ఇతర నిత్యావసర వస్తువుల్ని కూడా రేషన్‌కార్డుదారులకు అందిస్తాం. రాష్ట్ర ఆర్థికపరిస్థితి మెరుగుపడ్డాక అమల్లోకి తెస్తాం. బకాయిలున్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఉండవు. రాజకీయ ఒత్తిడి వస్తే నేను చూసుకుంటా. ఎవరేం చెప్పినా వారికి అధికారులు ధాన్యం కేటాయించొద్దు. గత భారాస ప్రభుత్వ హయాంలో ధాన్యం కేటాయింపుల విధానం లోపభూయిష్టంగా ఉండటంతో మిల్లర్లు భారీగా అక్రమాలకు పాల్పడ్డారు" అని మంత్రి విమర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మార్గదర్శకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. రికార్డుస్థాయి ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల్ని అభినందించారు.

**విదేశాలకు ధాన్యం ఎగుమతులు..**

"రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీగా పెరుగుతోంది. గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి అదనంగా 3.95 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ ఎగుమతి చేస్తాం. రైతులు కూడా అధిక డిమాండ్ ఉన్న ధాన్యం రకాల్ని సాగుచేయాలి" అని మంత్రి ఉత్తమ్ సూచించారు. గోదాముల కొరత తీర్చేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో కొత్త గోదాముల్ని ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే మిల్లర్లను ప్రోత్సహించడానికి కొత్త పాలసీ తెస్తామన్నారు. అంతకుముందు స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ ధాన్యం ఉత్పత్తి, నిల్వ, బియ్యం పంపిణీ పర్యవేక్షణకు వార్‌రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## మున్సిపాలిటీలకు బీజేపీ ఇన్‌చార్జ్‌ల నియామకం

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులను కూడా కొన్నిచోట్ల ఇన్‌చార్జ్‌లుగా, ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మరికొన్నిచోట్ల ఇన్‌చార్జ్‌లు, సహ ఇన్‌చార్జ్‌లకు సైతం బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. అన్నిచోట్లా ఎక్కడికక్కడే ఆయా వార్డులు, డివిజన్ల వారీగా బలమైన అభ్యర్థులను గుర్తించి ముగ్గురునలుగురు పేర్లతో జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించి అభ్యర్థుల నుంచి సేకరించేందుకు ఓ నమూనా దరఖాస్తులను కూడా నేతలకు అందజేసినట్టు పార్టీవర్గాల సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే అభ్యర్థులకు బీఫామ్ అందజేయడంతోపాటు ఎక్కడికక్కడ ఎన్నికల ప్రచారాన్ని ప్లాన్ చేయాలని సూచించారు. ఆయా మున్సిపాలిటీల్లో సంబంధిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పర్యవేక్షణ జరిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

రాష్ట్ర కార్యాలయంలో 'వార్‌రూమ్' ఏర్పాటు

ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల్లోని నాయకులతో సమన్వ యానికి నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వార్‌రూమ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వార్‌రూమ్‌లో పార్టీ నేతలతోపాటు, మానిటరింగ్ టీమ్, లీగల్‌సెల్‌కు చెందిన న్యాయవాదులు కూడా అందుబాటులో ఉంటారు. గురువారం రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జ్‌లుగా ఆయా మున్సిపాలిటీల బాధ్యతలను చూసే నేతలు ఏదో మొక్కుబడిగా కాకుండా అంకితభావంతో పనిచేసి పూర్తి ఫలితాలు సాధించేలా పనిచేయాలని రాంచందర్‌రావు సూచించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలనే సాధించినందున, మున్సిపల్ ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా పార్టీశ్రేణులు పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు.

అనుబంధ విభాగాల పనితీరును గురించి కూడా తెలుసుకున్నారు. పార్టీ నేతలు డా.ఎన్.గౌతమ్‌రావు, టి.వీరేందర్‌గౌడ్, అశోక్ వేముల, డా.కాసం వెంకటేశ్వర్లు, డా. బూర నర్సయ్యగౌడ్, బండా కార్తీకరెడ్డి, జయశ్రీ, బండారు విజయలక్ష్మి, డా.శిల్పారెడ్డి, ఎన్వీ సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

**దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

తాజా దావోస్ పర్యటనతో పాటు గతేడాది వరల్డ్ ఎకనమిక్ ఫోరం పర్యటనలో భాగంగా ఎంతెంత పెట్టుబడులు వచ్చాయో తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. గతేడాది దావోస్ పర్యటన తర్వాత రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో ప్రజలకు తెలియజేయాలని సవాల్ విసిరారు. గత పన్నెండేళ్లలో...బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీపరంగా పూర్తి స్థాయిలో సన్నద్ధం అవుతున్నామన్నారు. రాష్ట్రంలోని రెండేసి ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున (మొత్తం అయిదు) నిర్వహించే బహిరంగ సభల్లో కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారని తెలిపారు.

